క్లుప్తంగా

నేడు పాఠశాలల్లో తిథి భోజనం

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం 'తిథి' భోజనం నిర్వహించనున్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం దాతలు ముందుకు రావాల్సి ఉంది. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని విధిగా అమలు చేయడంతో పాటు దీనికి అదనంగా దాత ఇచ్చేవి మాత్రమే విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా దాతలు పెరుగు, పాయసం, అల్పాహారంగా పండ్లు, తీపి పదార్థాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీనిని ప్రజల్లో అవగాహన కోసం అమలు చేస్తున్నందున దాతలు ముందుకు రాని పాఠశాలల్లో ఉపాధ్యాయులే సొంతంగా తిథి కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

భ్రమరాంబ తల్లికి ఆషాఢ సారె



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామానికి చెందిన కఠారి శంకర్, మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో భక్తులు తొలుత గంగానమ్మ తల్లి, సాయిబాబా ఆలయం, మహాలక్ష్మి మాను వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ అమ్మవారికి మేళతాళాలతో ఆషాఢ సారె సమర్పించారు. వల్లూరు నాగేశ్వరరావు, వల్లి బాబూరావు, కాగితాల తిరుమలరావు పాల్గొన్నారు.

పామర్రులో..



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా సారెను ఆదివారం సమర్పించారు. గ్రామంలోని మహిళలు మేళ తాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చెరుకుని సారెను అమ్మవారికి అందజేశారు. ఆలయ అర్చకుడు ఎం.మాధవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.సుభద్ర, బి.రమాదేవి పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, పాల పొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. నాగబంధాల వద్ద గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

అమ్మవారికి శాకంబరీదేవి అలంకారం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 40 కేజీల వరకు పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, దుంపలు, అరటి గెలలను ఉపయోగించి అమ్మవారిని అలంకరించారు. ఆలయ అర్చకులు ముత్తేవి మాధవ్ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొగ్గరపు జాలయ్య, బి.సాయిబాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో చెత్త చేరవేసే కార్మికుని కుటుంబానికి సర్పంచ్, ఉపసర్పంచ్ ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్మికుడు పరసా శ్రీరాములు గుండెపోటుతో ఆదివారం ఉదయం మరణించారు. సమాచారం అందుకున్న సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఈడే సుధాకరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నిమగడ్డ భిక్షాలు శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీరాములు కుటుంబానికి సర్పంచ్ తరఫున భిక్షాలు, ఉపసర్పంచ్ సుధాకర్ రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

విష సర్పాలతో ప్రాణ సంకటం

- వర్షాకాలంలో మెండుగా సర్పాల సంచారం
- అవగాహన అవసరమంటున్న వైద్యులు
- మూలిక, హోమియో, ఇంగ్లిష్ వైద్యంతో ప్రాణాలు దక్కించుకోవచ్చు



పొలంలో విష సర్పాలు (ఫైల్)

గుడ్లవల్లేరు: అసలే వర్షాకాలం. ఖరీఫ్ సాగులో వరి పైరు ఏపుగా పెరుగుతోంది. చేల గట్ల మీద కూడా పచ్చగడ్డి పెరిగిపోయింది. నివాసాల మధ్య కూడా మొక్కలు ఇష్టానుసారంగా పెరిగిపోయే వర్షాకాలం ఇది. ఇక విష పురుగుల సంచారానికి అడ్డూ అదుపు లేకుండా విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. విష పూరితమైన పాములు, మండ్రకప్పలు, తేళ్లు తదితర కీటకాలు జనం ప్రాణాలను హరిస్తున్నాయి. ముఖ్యంగా పాములే ప్రాణాంతకంగా మారుతున్నాయి. పొలాల్లో ఎలుకలు, నత్తలు, ఇళ్లలో కప్పలను భక్షించేందుకు కట్లపాము, తాచుపాము, రక్త పింజేరు తదితర సర్పాలు సంచరిస్తాయి. ప్రజల్లో పాముకాటు వైద్యంపై సరైన అవగాహన లేకపోవటం వలన పాముకాట్లకు గురైన వారికి సమయస్ఫూర్తితో వైద్యం అందించలేకపోవటం వలన మరణాలు చోటు చేసుకుంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

హోమియోతో ప్రాణాన్ని కాపాడవచ్చు

హోమియో వైద్యంతో పాముకాటుకు గురైన వారి ప్రాణాన్ని కాపాడవచ్చు. ఈ వైద్యంలో ద్రోణ అనే హోమియో మందుతో చనిపోవటానికి చివరి నిమిషాల్లో ఉన్న వారిని కాపాడిన సందర్భాలున్నాయి. ప్రజల్లో హోమియో వైద్యంపై అవగాహన లేకపోవటంతో హోమియో ఆస్పత్రులకు పాముకాటుకు వెళ్లేవారి సంఖ్య తక్కువగా ఉంటోంది. పాముకాటుకు గురైన వారికి కాటు వేసిన వద్ద ద్రోణ మందును అంటించి, అదే మందును నోట్లో పోస్తే గుణం కనబడుతుంది. పాముకాటుకు గురైన వ్యక్తి లేచి కూర్చొనేవరకూ 10 నిమిషాలకు ఒకసారి ఈ వైద్య పద్ధతిని అమలు చేయాల్సిందే.

ప్రభుత్వాస్పత్రుల్లో పాముకాటుకు మందు



ప్రభుత్వాసుపత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ అనే మందు ఉంటుంది. పాము కాటేసిన వెంటనే ఆసుపత్రికి తీసుకొస్తే రోగికి ఇంజక్షన్ ఇస్తే కోలుకుంటాడు. పాము కాటేసిన మూడు గంటల్లో రోగిని తీసుకొస్తే ప్రాణాలు రక్షించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా రోగికి మానసిక ధైర్యం ఇచ్చేవిధంగా పక్కనున్న వారు ప్రవర్తించాలి. అంతేగాని ఆందోళనకు గురి చేస్తే, రోగి ఆ భయంతోనే ప్రాణాలు వదిలే అవకాశాలున్నాయని వైద్య శాస్త్రం చెబుతుంది.

– డాక్టర్ సీహెచ్.సుగుణావతి, ప్రభుత్వ గుడివాడ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు

తరతరాలుగా ఉచిత మూలికా వైద్యం



తరతరాలుగా పాము, తేలుకాటుకు మూలికా వైద్యం చేస్తూ వస్తున్నాం. తాతల కాలం నాటి నుంచి ఈ వైద్యాన్ని అందిస్తున్నాం. మా వైద్యానికి డబ్బులు తీసుకుంటే అది పని చేయదని మా తండ్రి రామ్మోహనరావు చెప్పారు. ఆయన నుంచి ఆ వైద్యాన్ని నేర్చుకున్నా. ఈ అవకాశం మా కుటుంబంలో నాకు రావటం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రాణాలు వదులుతున్న సమయంలో చివరి నిమిషాల్లో కూడా చాలామందిని కాపాడాను. నా వద్దకు వచ్చిన ఒక్క కేసు విఫలం కాలేదు. మా వద్ద ఉండే మూలికలు, ఆవుపాల మిశ్రమాన్ని పాముకాటుకు గురైన వారి నేత్రాలకు అంటిస్తే చాలు లేచి కూర్చొంటారు. పశువులు, గొర్రెలు, మేకలకైనా ఇదే వైద్య పద్ధతిని ఆచరిస్తాను.

– శాయన గణేష్‌బాబు, మూలికా వైద్యుడు, చినగొన్నూరు, గుడ్లవల్లేరు మండలం

'ఐ లవ్ గుడివాడ'లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం



రహదారులను శుభ్రం చేస్తున్న సభ్యులు

గుడివాడరూరల్: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు ఐలవ్ గుడివాడలో స్వచ్ఛంద, సామాజిక సంస్థలు భాగస్వామ్యమవుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడగా మార్చేందుకు రహదారులను ఆదివారం సైక్లింగ్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు క్లీన్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. బస్టాండ్ సెంటర్ నుంచి నాగవరప్పాడు వరకు రోడ్ల మధ్య ఉన్న డివైడర్లపై చెత్తను తొలగించారు. ఈ క్రమంలో వారికి ట్రాఫిక్ పోలీసులు కూడా సహకారం అందించారు. ఐలవ్ గుడివాడలో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మాగంటి శ్రీనివాస్, పొట్లూరి వంశీకృష్ణ, తారక వీరేంద్ర, సురేష్, సూరజ్, లయన్స్ సభ్యుడు శివశంకర్, గుడివాడ సైకిల్ క్లబ్ సభ్యులు, ఏఎన్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు తవ్వకం నిలిపివేత

ముదినేపల్లి రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా మండలంలోని దేవపూడిలో చేపట్టిన చెరువు తవ్వకాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం నిలిపివేశారు. గ్రామంలో నాలుగు ఎకరాల్లో చెరువు తవ్వి మట్టిని జాతీయ రహదారి నిర్మాణానికి తరలిస్తున్నట్టు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఆర్ఐ శివకుమార్ అనుమతులు లేకుండా చెరువు తవ్వరాదంటూ నిర్వాహకులను అడ్డగించి తవ్వకాన్ని నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్ఐ తెలిపారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలైన్లో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

బీజేపీ నాయకుడు సుబ్బారెడ్డికి నివాళులు



గుడ్లవల్లేరు: డోకిపర్రుకు చెందిన బీజేపీ నాయకుడు పురిటిపాటి సుబ్బారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన చిత్రపటానికి ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజబాబు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామినేని వెంకటకృష్ణ పూలమాల వేసి నివాళుర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బీజేపీ మండల నాయకులు రామారావు, రవీంద్ర పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తోట్లవల్లూరు: ఇసుక అక్రమ రవాణకు పాల్పడుతున్న ట్రాక్టర్ పోలీసులకు పట్టుబడిన ఘటన మండలంలోని రొయ్యూరులో జరిగింది. గ్రామానికి చెందిన వల్లూరు శ్రీనివాసరావు ట్రాక్టర్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. అక్రమ రవాణకు పాల్పడుతున్న శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



బొడ్డపాడులో ఆటోతో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

తోట్లవల్లూరు: బొడ్డపాడులో దోమలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు తెలిపారు. దోమల నియంత్రణకు గ్రామం మొత్తం ఫాగింగ్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇళ్ల ఆవరణలలో ఎక్కడా నీరు నిలువ లేకుండా చూసుకోవాలని కోరారు. ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కనగాల వెంకట సత్యనారాయణ, నిమ్మగడ్డ సీతారాంబాబు, వర్రె చిట్టి వెంకటేశ్వరరావు, మసిముక్కు శ్రీనివాసరావు, సత్యం పాల్గొన్నారు.

అధికారుల పేరుతో సాకులు చెబుతున్న ఎమ్మెల్యేలు

పామర్రు: అధికార పార్టీ ఎమ్మెల్యేలు అధికారులపై సాకులు చెబుతూ ప్రజా సమస్యలు పరిష్కరించలేక పోతున్న విషయం జిల్లా పరిషత్ సమావేశంలో సాక్షిగా బయట పడ్డాయని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాసు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడిన తీరు ఇందుకు నిదర్శనంగా ఉందన్నారు. ఈ సమావేశంలో అవినిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సాగునీటి విషయంలో అధికారులు చొరవచూపడం లేదనే అంశాన్ని తెలియజేశారన్నారు. అలాగే పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నిమ్మకూరు గురుకుల పాఠశాలలో లెక్కల మాస్టారు అంశాన్ని లేవనెత్తారన్నారు. వీరితో పాటు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తదితర ఎమ్మెల్యేలు ఇదే వైఖరిని ప్రదర్శించారు. ఈ వైఖరి సమంజసం కాదని అధికారులతో పని చేయించాల్సిన అవసరం ఉందని దాసు పేర్కొన్నారు.

పుష్కలంగా నీటి సరఫరా



పుల్లేరు కాలువకు జలకళ

పామర్రు: రవీస్ కాలువ నుంచి రెండు వేలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు సరఫరా అవుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆదివారం స్థానిక బల్లిపర్రు లాకుల వద్ద నీటి ఉధృతి పెరిగిందని పేర్కొన్నారు. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో రోజు రోజుకు పెరుగుతోందన్నారు. 500 క్యూసెక్కుల నుంచి ప్రస్తుతం రెండు వేల క్యూసెక్కుల వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని తొలుత తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని, తర్వాత సాగుకు వినియోగించాలని అధికారులు పేర్కొన్నారు.

భారీ ఊరేగింపుతో పైడమ్మకు సారె



కాపుల వీధి నుంచి అమ్మవారికి సారె ఇచ్చేందుకు ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు

పెడన: పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి ఆదివారం గ్రామ దేవత అయిన శ్రీపైడమ్మ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాఢం సారెను సమర్పించారు. కాపుల వీధిలోని మహిళలు ఊరేగింపులో మేళతాళాలతో బయలుదేరి పాత కూరగాయల మార్కెట్ వద్ద పోతురాజు స్వామి గుడి వద్ద, గుడివాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఘటం గుడి వద్ద ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట తుదిగా పైడమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. శిష్టకరణం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం సమీపంలోని వారి ప్రాంతం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీపైడమ్మ అమ్మవారికి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. బ్రహ్మపురంలోని దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పైడమ్మ దేవస్థానానికి చేరుకుని ఆషాఢం సారెను అమ్మవారికి అందజేశారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావు, వంశపారంపర్య ధర్మకర్త దాసు వాయునందనరావు తదితరులు పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కదంబం ప్రసాదాలను అందజేశారు.

బారా ఇమామ్ పంజాలో ప్రత్యేక ప్రార్థనలు

గూడూరు: గూడూరులోని బారా ఇమామ్ పంజాలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహరంను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రార్థనలో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంజాలో అన్న సమారాధన నిర్వహించారు. ప్రార్థనలకు ఆచరణ భక్తులు తబర్రుక్ స్వీకరించారు.

భక్తి శ్రద్ధలతో పవిత్రోత్సవాలు



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు రెండో రోజూ ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్ కుమార్ శర్మ బ్రహ్మత్వంలో వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు గోపూజ, సుప్రభాత సేవ, నిత్యార్చన, నవకుంభారోపణం, ఏకాదశ ద్రవ్యాభిషేకం, అన్నాభిషేకం, సుబ్రహ్మణ్యమాల మంత్ర అనుస్టానములు, హవనం, మూల మూర్తులకు ఉత్సవ మూర్తులకు పట్టు పవిత్రాలు సమర్పణ, మహానివేదన, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ప్రదోష కలార్చన, నిత్య హోమం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

రాజ్యాంగ పీఠికపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

కైకలూరు: రాజ్యాంగ పీఠికపై విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించటం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని అమలు పరచగలమని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ సేవాసమితిలో సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఇష్టాగోష్టి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య దృక్పథాన్ని విద్యార్థులతో మార్చటానికి రాజ్యాంగ పీఠిక పరిచయం పాఠశాలల్లో పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందుకోసం జనవిజ్ఞాన వేదిక, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు, ఉపాధ్యాయులు మేధావులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు కీర్తిశేషులు జంపా కృష్ణకిషోర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, జి. విజయగణేష్, కేజే మోహనరావు, పి.సీతారామరాజు, పి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, వెంకట్రావ్‌ను సత్కరిస్తున్న నాయకులు

పమిడిముక్కల: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పామర్రు, గన్నవరం ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. మండలంలోని మంటాడ, కపిలేశ్వరపురం, వీరంకిలాకు, పెనుమత్స గ్రామాల్లో ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావ్‌కు ఆదివారం ఘన స్వాగతం పలికారు. తొలుత మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. భారీ ఊరేగింపు, బైక్ ర్యాలీతో పెనుమత్స తరలివెళ్లారు. ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి స్వగ్రామానికి విచ్చేసిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు.

ఘనంగా గంగానమ్మ తల్లి జాతర



మోపర్రు శ్రీగంగానమ్మ తల్లికి బోనాలు పెట్టుకుని తిరుగుతున్న భక్తులు

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామంలో శ్రీ గంగానమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో బోనాల జాతర జరిగే విధంగా గ్రామంలో నిర్వహించారు. సుమారు 151 మంది మహిళలు నెత్తిపై బోనాలు పెట్టుకుని గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగారు. గ్రామంలోని మహిళలే కాకుండా ఏలూరు, చింతలపూడి, హైదరాబాద్, విజయవాడ నుంచి మహిళలు వచ్చి బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన శివయ్య ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి గంగానమ్మ తల్లి జాతర తెలంగాణ రాష్ట్రంలో జరిగే మాదిరిగా గ్రామంలో కూడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో బోనాల జాతర నిర్వహించటంతో చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి అమ్మవారికి పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామోత్సం అనంతరం భక్తులకు అన్న సమారధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాగునీటి కోసం అవస్థలు



సాయినగర్ ప్రజలకు వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

పామర్రు: తాగునీటి కుళాయిల ద్వారా నీరు సక్రమంగా రాక పోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. స్థానిక సాయినగర్, బాపూజీ పేట, కొరముక్కువానిపురం, రాళ్లబండివారి చెరువు తదితర ప్రాంతాల వాసులకు కొన్ని రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ వారు వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి తవ్వకాల్లో ఆయా ప్రాంతాలకు రావాల్సిన తాగునీటి పైపులు పాడైపోయి వారాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో పైపులైను పనులను త్వరిత గతిన పూర్తి చేసి తాగునీటిని ప్రజలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎస్సీల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాగిశెట్టి ధర్మయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎస్సీల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీల కోసమే సద్వినియోగం చేయాలన్నారు. నిధుల వినియోగంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఉద్యోగులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం జీతంతో కూడుకున్న స్టడీలీవ్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఎస్సీ, ఎస్టీ రోస్టర్ల తనిఖీపై జారీ చేసిన జీవోల ప్రకారం జిల్లాస్థాయిలో అధికారులు రోస్టర్లను తనిఖీ చేయాలన్నారు.

రాష్ట్రంలో ఇవ్వాల్సిన నామినేటెడ్ పదవలను ఆ సంఘ పరిధిలో పనిచేసిన వారికి ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కర్ర సునీల్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి తదితరులు బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని పునర్నిర్మించడానికి దృఢనిశ్చయంతో ఉన్నందున వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో భాగంగా సముచిత స్థానాన్ని కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మద్దాల కృష్ణకుమార్, దాసి జయప్రకాష్, కొసనం క్రాంతికుమార్, కొంద్రు రాజు తదితరులు పాల్గొన్నారు.